# రక్షకులా.. భక్షకులా..!

- కేసులు, పాత నేరాల పేరిట వసూళ్లు
- పట్టుబడ్డ సొత్తునూ మార్చేస్తున్న వైనం

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే**

జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్లలో కొందరు సిబ్బంది తీరు విస్మయం కలిగిస్తోంది. వివిధ కేసుల్లో పట్టుబడిన వారి నుంచి వీలైనంత నగదు వసూలు చేయడంతో పాటు పట్టుపడ్డ సొత్తును సైతం మార్చేసి సొమ్ము చేసుకుంటున్న ఉదంతాలు బయటపడుతున్నాయి. విషయం బహిర్గతమైనా ఎలాంటి చర్యలు లేకపోవడంతో వారి దందాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది.





### పందేల పందేరం..

గత వైకాపా హయాంలో డెల్టాలో జూదాలకు పేరొందిన పలు మండలాల్లో ఆదివారం అనగానే కోడిపందేలు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. దీనికి ఆయా స్టేషన్లకు ఎంతో కొంత నజరానా అందుతుందనే ఆరోపణలున్నాయి. గోదావరి తీరంలోని తోటల్లో పందేలు, జూదాలు విచ్చలవిడిగా జరుగుతున్నా సంబంధిత పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది.

### కోడి పుంజులనూ వదల్లే..

పశ్చిమగోదావరి జిల్లా సరిహద్దు స్టేషన్ పరిధిలో కోడిపందేల స్థావరాలపై పోలీసులు ఇటీవల దాడులు చేశారు. ఆ సమయంలో మేలుజాతి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో కొన్నింటిని రూ.40 వేల నుంచి రూ.60 వేలకు ఆ స్టేషన్ రాతగాడు విక్రయించేసినట్లు ఆరోపణలున్నాయి.



పుంజులను అధికారికంగా చూపే సమయంలో సాధారణ కోళ్లను ఉంచడంతో పందెగాళ్లు అవాక్కయ్యారు. జరిగిన అన్యాయంపై గుర్రుగా ఉన్నారు. ఈ విషయం బయటకు పొక్కకుండా ఆ స్టేషన్ సిబ్బంది విశ్వప్రయత్నాలు చేశారు.

### మళ్లీ వారిదే హవా..

జూదాల నిర్వహణలో వైకాపా పాలనలో చక్రం తిప్పినవారి హవానే ఇప్పుడూ కొనసాగుతోంది. డెల్టాలోని ఓ నియోజకవర్గంలో గతంలో పొలాలు, చెరువుల గట్టున ఉన్న విశ్రాంతి గదుల్లో జూదాలు ఆడేవారంతా ఇప్పుడు దర్జాగా కొన్ని ఇళ్లలోనే వాటిని కొనసాగిస్తున్నారు. అయినా అటువైపు పోలీసులు వెళ్లేందుకు సాహసించడంలేదనే విమర్శలున్నాయి. జూదాల నిర్వాహకులు అధికారంలోకి ఏ పార్టీ వస్తే ఆ జెండా కిందకు చేరి తమకు అడ్డులేకుండా చేసుకుంటున్నారనే వాదనలున్నాయి.

### మూడొంతులు నొక్కేసి..

జిల్లా కేంద్ర పరిధిలో ఓ స్టేషన్‌కు కొత్తగా వచ్చిన అధికారులు వెంటనే ఖాళీ స్థలాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిని పట్టుకోవడం ఆరంభించారు. ఆ ముసుగులో అందినంతా దండుకున్నారు. రూ.500 జరిమానా విధించినా అనధికారికంగా ఒక్కొక్కరి నుంచి రూ. 2 వేల చొప్పున లాగేశారు. ఇదే ప్రాంతంలో గతంలో చోరీలకు



పాల్పడిన వారిని స్టేషన్లకు పిలిచి వారి సహచరుల సమాచారం తెలుసుకున్నారు. ఇదంతా నేరాల నియంత్రణకు చేపడుతున్న చర్యల్లో భాగమే కదా అనుకుంటే పొరపడినట్లే. తరువాత వారందరి నుంచి రూ. 20 వేల నుంచి రూ. 30 వేల వరకు లాగేయడంతో బాధితులంతా ఘొల్లుమంటున్నారు.

## ధరల నియంత్రణకు చర్యలు :జేసీ

**భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** కూరగాయల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సంయుక్త కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టోకు మార్కెట్లో ధరలు తగ్గుముఖం పట్టినా చిన్న వ్యాపారులు అధిక ధరలకు కూరగాయలు విక్రయిస్తుండటంతో వినియోగదారులు నష్టపోతున్నారన్నారు. వెంటనే ధరలను సవరించకుంటే ఏపీ వినియోగదారుల ఈసీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎస్‌వో సరోజ, మార్కెటింగ్ శాఖ ఏడీ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రగతికి ప్రణాళిక 6లో

# గౌరవంగా.. గృహయోగం!

## నేడు అవగాహన సభలు

**భీమవరం పట్టణం, అర్బన్, న్యూస్‌టుడే:** గత సర్కారు వైఫల్యాలతో జిల్లా వ్యాప్తంగా పేదల గృహ నిర్మాణాల ప్రగతి కుంటుపడింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ పరిస్థితిలో మార్పు తెచ్చి పేదల సొంతింటి కల సాకారం చేసేలా 'మన ఇల్లు - మన గౌరవం' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించింది. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నేడు(శనివారం) అవగాహన సభలు నిర్వహించనున్నారు.



వీరవాసరం పెదపేటలో నిర్మాణ దశలో ఇళ్లు (పాత చిత్రం)

పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 625 పేదల నివాస సముదాయాల్లో 73,792 మందికి స్థలాలు కేటాయించారు. అర్హుల ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం రూ. 1.80 లక్షల చొప్పున మంజూరు చేసింది. ఈ మొత్తం ఎటూ సరిపోదనే యోచనతో అధికశాతం లబ్ధిదారులు గృహ నిర్మాణాలకు ముందుకు రాలేదు. ప్రారంభించిన వారు కూడా ఆర్థిక ఇబ్బందులతో నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేశారు. నిర్మాణ సామగ్రి ధరలు ఎక్కువగా ఉండటం, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పైసా కూడా అదనపు నిధులు మంజూరు చేయకపోవడం, ఊరికి దూరంగా ఉన్న లేఅవుట్లకు తగిన రహదారి కూడా లేకపోవడం తదితర కారణాలతో కొందరు అసలు నిర్మాణాలు ప్రారంభించలేదు. ఐచ్ఛికం- 3 కింద గుత్తేదారులు చేపట్టిన నిర్మాణాలు కూడా చాలా చోట్ల నిలిచిపోయాయి.

### వచ్చే మార్చి వరకే అవకాశం

ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన నిధులను వచ్చే ఏడాది మార్చిలోపు వినియోగించుకోకపోతే వెనక్కి వెళ్లే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 'మన ఇల్లు - మన గౌరవం' పేరుతో లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు పూర్తి చేయించాలని నిర్ణయించింది. స్థలాలు పొందిన వారంతా గడువులోపు నిర్మాణాలు పూర్తి చేస్తేనే బిల్లులు మంజూరవుతాయని చెబుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో గ్రామాల్లో అవగాహన సభలు నిర్వహించి లబ్ధిదారులను చైతన్య పరిచేందుకు ప్రత్యేక అధికారులను కూడా నియమించినట్లు గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకుడు జి. పిచ్చియ్య తెలిపారు.

| జిల్లాలో ఇలా.. | నివాస సముదాయ స్థలాలు | మంజూరైన ఇళ్లు | పూర్తయినవి | వివిధ దశల్లో ఉన్నవి |
|---|---|---|---|---|
| | 625 | 70,119 | 29,875 | 31,695 |

## జల్లెడలా దారి... జటిలమే మరి!

పెనుమంట్ర మండలం బ్రాహ్మణచెర్వు నుంచి వీరవాసరం వెళ్లే ర.భ.శాఖ రహదారి జల్లెడలా మారింది. పొలమూరు శివారు నౌడూరు కూడలి సమీపంలో రోడ్డు అడుగుకో గుంతలా తయారైంది. చిన్నపాటి వర్షానికే గోతుల్లో నీరు నిలిచిపోతోంది. కొన్నాళ్ల కిందట మరమ్మతులు చేసినా, ఇటీవల వర్షాలకు మరింత దెబ్బతింది. వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు.



- న్యూస్‌టుడే, పెనుమంట్ర

## విజయములీయగ రావమ్మా!

దేవీ నవరాత్రులు సమీపిస్తున్న వేళ దుర్గాదేవి విగ్రహాల తయారీ ఊపందుకుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పది అడుగుల ఎత్తు వరకూ వివిధ రూపాల్లోని దుర్గామాత విగ్రహాలను తయారు చేస్తున్నారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి తమకు కావాల్సిన రూపాల్లో ప్రతిమల తయారీకి ఒప్పందాలు చేసుకుంటున్నారు. అత్తిలిలో సిద్ధం చేస్తున్న అమ్మవారి విగ్రహాలివి.



-ఈనాడు, అత్తిలి

## దసరాకు అదనపు బస్సులు



ప్రసాద్

**భీమవరం అర్బన్, న్యూస్‌టుడే:** దసరా రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనంగా ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేయనున్నట్లు శుక్రవారం బాధ్యతలు చేపట్టిన జిల్లా ప్రజా రవాణాధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ తెలిపారు. ఇప్పటి వరకు ఆయన ఏలూరు జిల్లా అధికారిగా పని చేస్తూనే పశ్చిమగోదావరికి ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. తాజాగా ఆయన్ను పశ్చిమగోదావరి జిల్లా అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ సందర్భంగా ఆయనకు ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. పీవో గీతావాణి, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం డిపోల మేనేజర్లు గిరిధర్‌కుమార్, వై సత్యనారాయణమూర్తి, సుబ్బన్నరెడ్డి, భీమవరం డిపో సహాయ మేనేజర్ సురేశ్, పీఆర్వో రావి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పొడిగింపా... వదిలింపా

### ముగిసిన భూ రీసర్వే డీటీల కాలపరిమితి

**ఈనాడు డిజిటల్, భీమవరం, నరసాపురం, న్యూస్‌టుడే:** జిల్లాలో రీసర్వే ఉప తహసీల్దార్ల పరిస్థితి గాల్లో దీపంలా మారింది. గత ప్రభుత్వం రెండేళ్ల కాల పరిమితితో ఇచ్చిన ఉద్యోగోన్నతి ఈనెల 21తో ముగిసింది. గత ప్రభుత్వం జగనన్న శాశ్వత భూహక్కు - భూరక్ష పథకాన్ని ప్రారంభించినప్పుడు డీటీలకు హడావుడిగా తాత్కాలిక ఉద్యోగోన్నతి కల్పించింది. ప్రస్తుతం వారికి ఉద్యోగోన్నతి గడువును పొడిగిస్తారా లేదా అన్నది సందిగ్ధం నెలకొంది. క్షేత్రస్థాయిలో తలెత్తే భూవివాదాలు, సమస్యల పరిష్కారాలకు గత ప్రభుత్వం 2022 సెప్టెంబరు 22న రీసర్వే పోస్టులు సృష్టించింది. రెండేళ్ల కాలపరిమితితో సూపర్ న్యూమరరీ పోస్టులకు శ్రీకారం చుట్టి, తహసీల్దారు కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్ పోస్టులకు మంగళం పాడింది. ఉమ్మడి జిల్లాలో 47 మండలాల్లో 47 పోస్టులను రద్దు చేసి రీసర్వే డీటీ పోస్టులను సూపర్ న్యూమరరీగా మార్చింది. సీనియర్ అసిస్టెంట్, ఎంఆర్ఐలకు తాత్కాలిక ఉద్యోగోన్నతి కల్పించారు.



### రీసర్వే పనులు ఆపేసింది

భూ రీసర్వేపై ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో కూటమి ప్రభుత్వం వచ్చాక ఆపేసింది. అంతకు ముందు కూడా సార్వత్రిక ఎన్నికల నియమావళి దృష్ట్యా ఏప్రిల్ నుంచి అన్ని మండలాల్లో సర్వే పనులు ఆగిపోయాయి. అప్పటి నుంచి వారికి నిర్దిష్టమైన విధుల్లేకపోవడంతో సంబంధిత తహసీల్దార్లు తమ పరిధిలో కావాల్సిన పనులు చేయించుకుంటున్నారు. దీనిపై డీఆర్‌వో ఉదయ్‌భాస్కర్‌ను వివరణ కోరగా వారిని కొనసాగించాలా వద్దా అనే దానిపై ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తర్వులు రాలేదన్నారు. అయితే ఈనెల 21తో గడువు ముగియడంతో జీతాల చెల్లింపు విషయమై ఖజానా శాఖ డీటీవో గణేశ్‌ను వివరణ కోరగా ప్రస్తుత నెలకు సంబంధించి బిల్లులు చెల్లిస్తామని, పనిదినాలకే జీతం చెల్లించాలంటే రికవరీ చేస్తామన్నారు.

# పరీక్షల పేరుతో దోచేస్తున్నారు

- జ్వరాలు ముసురుతున్న వేళ ఇష్టారాజ్యం
- అవసరం ఉన్నా లేకున్నా చేయించాల్సిందే
- పేద మధ్యతరగతి కుటుంబాలపై పెనుభారం

**ఈనాడు, భీమవరం, న్యూస్‌టుడే- జంగారెడ్డిగూడెం పట్టణం, పెనుమంట్ర**

జ్వరాల విజృంభిస్తున్న వేళ.. ఇదే అదనుగా కొందరు ల్యాబు నిర్వాహకులు దోపిడీ చేస్తున్నారు. వైద్యులతో కుమ్మక్కై అవసరం లేకున్నా అన్ని రకాల పరీక్షలు చేయిస్తున్నారు. మరో పక్క ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరీక్షలు సవ్యంగా చేయక పేద, మధ్యతరగతి వర్గాలు ఆర్థికంగా చితికిపోతున్నారు.



- జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఓ కుటుంబంలో ముగ్గురు జ్వరంతో బాధపడుతూ స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. .రోగుల పరిస్థితి తెలుసుకోకుండా అక్కడి వైద్యుడు ముగ్గురికీ అన్ని రకాల రక్త పరీక్షలు అవసరమని చెప్పి... రూ.2500 చొప్పున రూ.7500 వసూలు చేసి ఆసుపత్రిలోని ల్యాబులో చేయించారు. తీరా చూస్తే వారికి సాధారణ వైరల్ జ్వరాలే అని తేలింది.

- పెనుమంట్ర మండలం మార్టేరుకు చెందిన భార్యాభర్తలు జ్వరంతో స్థానిక ఆర్‌ఎంపీ దగ్గరకు వెళ్లారు. ఆయన పరీక్షలన్నీ చేయించి ప్లేట్‌లెట్లు పడిపోతున్నాయని 7 రోజుల కోర్సు వాడాలని చెప్పారు. తనకు అనుబంధంగా ఉన్న ఓ ల్యాబులో అవసరం ఉన్నా లేకున్నా పలు మార్లు డెంగీ, మలేరియా, ప్లేట్‌లెట్ల సంఖ్య తదితర పరీక్షలు చేయించారు. కేవలం పరీక్షలకే వారి నుంచి రూ.12 వేలు వసూలు చేశారు. వైద్యానికి రూ.40 వేలు అయ్యింది.

### ప్యాకేజీ పరీక్షలతో దోపిడీ

తణుకుకు చెందిన ఓ వ్యక్తికి గురువారం జ్వరం రావటంతో ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. వైద్యుడు రోగి లక్షణాలు తెలుసుకోకుండానే ప్యాకేజీ పరీక్షలు చేయించుకోవాలని చీటీ రాసి పంపారు. అందులో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, ప్లేట్‌లెట్, మధుమేహం ఇలా అన్ని రకాల పరీక్షలు ఉన్నాయి. అన్నింటికీ కలిపి రూ.2200 వసూలు చేశారు. తీరా చూస్తే సాధారణ జ్వరం అని మందులిచ్చి పంపేశారు. ఇలా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రధాన పట్టణాలు, నగరాల్లో జరుగుతోంది.

**మూడేళ్లలో నమోదైన జ్వరాల కేసులు**

| ఏడాది | డెంగీ | మలేరియా | టైఫాయిడ్ |
|---|---|---|---|
| 2022–23 | 455 | 101 | 6012 |
| 2023–24 | 423 | 195 | 4621 |
| 2024–25 ఇప్పటి వరకు | 350 | 216 | 3456 |

### ప్రభుత్వ ఆసుపత్రుల్లో గందరగోళం

ఏలూరు సర్వజన ఆసుపత్రి మొదలు చాలా ఆసుపత్రుల్లో పరీక్షల ఫలితాల్లో కచ్చితత్వం ఉండటం లేదు. ఇటీవల ఓ గర్భిణికి జ్వరం రావటంతో ఏలూరు జిల్లా ఆసుపత్రికి తీసుకువచ్చారు. హెచ్‌బీ పరీక్ష చేయించగా 6 పాయింట్లే ఉన్నట్లు చూపించింది. దీంతో కుటుంబ సభ్యులు కంగారు పడ్డారు. వెంటనే ప్రైవేటు ల్యాబులో పరీక్షించగా 9.5 వరకు ఉన్నట్లు చూపించింది. ఇలా చాలా పరీక్షల్లో వచ్చిన ఫలితాలపై నమ్మకం లేక ఆర్థిక భారం ఉన్నా ప్రైవేటు వైపే వెళుతున్నారు.

| ఉమ్మడి జిల్లాలో.. | |
|---|---|
| ప్రైవేటు ఆసుపత్రులు: | 700 |
| అనుమతులున్న ప్రైవేటు ల్యాబులు: | 419 |
| అనధికారిక ల్యాబులు: | దాదాపు 200 |
| ఆర్‌ఎంపీల సంఖ్య | దాదాపు 1200 |

### ఆర్థికంగా చితికిపోతున్నారు

మూడు నెలల నుంచి ఉమ్మడి జిల్లాలో జ్వరాల ప్రభావం చాలా ఎక్కువగా ఉంది. బాధితుల లెక్క ప్రభుత్వం రికార్డుల్లో వందల్లో ఉంటే క్షేత్రస్థాయిలో వేలల్లో ఉంది. చాలా ఆసుపత్రుల్లోనే ల్యాబులు ఉండగా.. లేనివారు బయట ల్యాబు నిర్వాహకులతో కుమ్మక్కయ్యారు. ఆర్‌ఎంపీలు సైతం ఎలాంటి అనుమతులు లేకుండా వెనకుండి ల్యాబులు నిర్వహిస్తున్నారు. దీంతో అవసరమైనా లేకున్నా అన్ని రకాల పరీక్షలు చేయిస్తున్నారు. ఒక్కొక్కరికీ పరీక్షలకే రూ. 2000 వరకు ఖర్చవుతోంది. కుటుంబం మొత్తం బాధితులైతే పరీక్షలకే రూ.8 వేల ఖర్చవుతోంది. దీంతో పాటు ఓపీ, మందులు, ప్రయాణ ఖర్చులు కలిపితే తడిసి మోపెడవుతోంది. పేద, మధ్యతరగతి ప్రజలకు ఇది పెనుభారంగా మారింది. దీనిపై ఏలూరు, పశ్చిమ డీఎంహెచ్‌వోలు శర్మిష్ఠ, మహేశ్వరరావులు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## భారీ వర్షంతో జలమయం

**భీమవరం పట్టణం, అర్బన్, ఆకివీడు, న్యూస్‌టుడే:** జిల్లాలో ని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం భారీ వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు, రహదారులపై నీరు నిలిచింది. భీమవరం, ఆకివీడు పట్టణాల్లో ప్రధాన, అంతర్గత రహదారులు జలమయమయ్యాయి.



భీమవరం ఏఎస్ఆర్ నగర్‌లో..



'ప్రశాంత ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కొన్నాళ్లుగా గంజాయి ఘాటు గుప్పుమంటోంది. పల్లె నుంచి పట్టణం వరకు సారా ఏరులై పారుతోంది. అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల సరిహద్దులోని చించినాడ వశిష్ఠ వంతెన వద్ద ఈ ఏడాది మూడుసార్లు గంజాయి విక్రేతలను పోలీసులు అరెస్టు చేశారు.'

'వైకాపా ప్రభుత్వ హయాంలో జంగారెడ్డిగూడెంలో కల్తీ సారా తాగి పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటన కళ్లముందే కదలాడుతోంది. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా పునర్ వ్యవస్థీకరించాల్సిన బాధ్యత ఎక్సైజ్ శాఖపై ఉంది.'

# సానుకూలతలెన్నో... సవాళ్లన్నీ!

- ఎక్సైజ్ శాఖపై గురుతర బాధ్యత
- గంజాయి, సారా కట్టడిపై దృష్టి

**న్యూస్‌టుడే - పాలకొల్లు**

దశలవారీగా మద్యపానం నిషేధిస్తామని 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా... ఆ తర్వాత హామీని అటకెక్కించింది. మద్యం ధరలను విపరీతంగా పెంచేసింది. నాసిరకం మద్యాన్ని వినియోగంలోకి తీసుకొచ్చి... ప్రజల ఆరోగ్యంతో ఆటలాడింది. అక్రమ అమ్మకాలు, సారా కట్టడికి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) ఏర్పాటు చేసి చేతులు దులుపుకొంది. సెబ్‌కు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించిన పాపాన పోలేదు. ఎక్సైజ్ సిబ్బందిని విభజించి పబ్బం గడుపుకొంది. వైకాపా నేతల ఒత్తిళ్లతో సెబ్ యంత్రాంగం కార్యాలయాలకే పరిమితమైంది. ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం సెబ్‌ను ప్రక్షాళన చేసి... ఎక్సైజ్ శాఖకు పునర్వైభవం తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంది. అక్టోబర్ 2 నుంచి నూతన మద్యం విధానం అమలులోకి వస్తున్న నేపథ్యంలో... సెబ్‌ను ఎక్సైజ్‌లో విలీనం చేస్తూ ఇప్పటికే ఉత్తర్వులు సైతం జారీ చేసింది.



### ప్రగల్భాలకే పరిమితం

మద్యం అమ్మకాలు పారదర్శకంగా చేస్తామంటూ వైకాపా ప్రభుత్వం ప్రగల్భాలు పలికినా... అనేక చోట్ల ఉద్యోగులే అక్రమాలకు పాల్పడ్డారు. వారిపైనే పెద్ద సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. గొలుసు దుకాణాలు, అక్రమ అమ్మకాలను కట్టడి చేయాల్సిన సెబ్... మద్యం దుకాణాల్లో పని చేసే వారికి కాపలా కాసేందుకే పరిమితమైంది. మద్యం సరఫరా ఎక్సైజ్‌కు, పర్యవేక్షణ సెబ్‌కు అప్పగించడంతో అయిదేళ్లపాటు వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది.

### పూర్తి అధికారాలు

కొత్త విధానంలో ఎక్సైజ్ శాఖకు పూర్తిస్థాయిలో అధికారాలు, కార్యాలయాలు, సిబ్బంది కేటాయింపునకు పచ్చజెండా ఊపింది. ప్రస్తుతం పూర్వ జవసత్వాలు వచ్చిన నేపథ్యంలో... ప్రధానంగా గంజాయిపై ఉక్కుపాదం మోపాల్సిన సమయం ఆసన్నమైంది. ఉమ్మడి జిల్లాలో గంజాయి చాపకింద నీరులా విస్తరిస్తోంది. యువత గంజాయి మత్తులో జోగుతోంది. దీనిపై విస్తృతంగా తనిఖీలు చేపట్టి, విక్రేతలను కటకటాల్లోకి పంపాలి. సారా తయారీ, విక్రయాలపైనా దృష్టి సారించాలి. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే గొలుసు దుకాణాలపైనా నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

| కొత్త విధానంలో ప్రయోజనాలివీ | ఏర్పాటయ్యే అబ్కారీ స్టేషన్లు | కొలువుదీరనున్న సీఐలు | ఎస్సైలు / హెడ్‌కానిస్టేబుళ్లు | కానిస్టేబుళ్లు |
|---|---|---|---|---|
| | 13 | 13 | ఎస్సైలు : 26, హెడ్‌కానిస్టేబుళ్లు : 50 | 150 |

## 30 పోలీసు చట్టం అమలు

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** భీమవరం డివిజన్ పరిధిలో 30 పోలీసు చట్టం అమలులో ఉందని డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య తెలిపారు. సభలు, సమావేశాలు, ప్రదర్శనలకు ముందస్తుగా అనుమతులు తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కాళ్ల మండలం ఏలూరుపాడులో ఇటీవల జరిగిన సంఘటనల దృష్ట్యా స్థానిక తహసీల్దారు 144 సెక్షను విధించారన్నారు. నలుగురి కంటే ఎక్కువమంది గుమిగూడి ఉండకూడదని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# పారిశ్రామిక ప్రగతికి ప్రణాళిక



రామరాజుకు కేకు తినిపిస్తున్న నాయకులు, కార్యకర్తలు

**ఆకివీడు, కాళ్ల, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి ప్రణాళిక అమలు చేస్తామని ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ (ఏపీఐఐసీ) ఛైర్మన్ మంతెన రామరాజు పేర్కొన్నారు. అమరావతి నుంచి శుక్రవారం ఉండి నియోజకవర్గానికి వచ్చిన ఆయనకు ఆకివీడు మండలం దుంపగడపలో ఉప్పుటేరు వంతెన వద్ద తెదేపా, జనసేన, భాజపా నాయకులు, కార్యకర్తలు గజమాల వేసి ఘన స్వాగతం పలికారు. కేకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. భారీగా తరలివచ్చిన కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి ప్రదర్శనగా అయిభీమవరం, చెరుకుమిల్లి, కాళ్ల మండలం జువ్వలపాలెం మీదుగా కాళ్లకూరు క్షేత్రానికి వెళ్లి వెంకటేశ్వరస్వామి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ అందరి సహకారం వల్లే తనకు ఈ పదవి దక్కిందన్నారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రగతి కుంటుబడిందన్నారు. లోపాలను సరిదిద్ది రాష్ట్రాన్ని ప్రగతి బాట పట్టించే దిశగా కూటమి ప్రభుత్వం పక్కా ప్రణాళికను అమలు చేస్తుందన్నారు. తెదేపా మండల అధ్యక్షుడు మోటుపల్లి రామవరప్రసాద్, నాయకులు బొల్లా వెంకట్రావు, పిల్లా నరసింహరావు, గొంట్లా గణపతి, గంధం ఉమా, గవర లక్ష్మి, నరహరిశెట్టి బాబీ, కన్నబాబు, కె.సుమంత్, భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

## కలిసొచ్చిన జనం కట్టారు కైలాసవనం





ఆఖరి మజిలీ సమస్యకు ఆరు గ్రామాల ప్రజలే ముగింపు పలికారు. వశిష్ఠ గోదావరి తీరాన ప్రకృతి రమణీయత మధ్య సుందర కైలాస వనం నిర్మించుకున్నారు. వడ్డిలంక, గంగడపాలెం, మట్లపాలెం, నార్నిమెరక, నక్కాపాలెం, లక్ష్మీపాలెం గ్రామస్థులు రూ.30 లక్షలకు పైగా స్వచ్ఛంద విరాళాలు పోగు చేసుకున్నారు. దక్షిణ కాశీగా ఖ్యాతి గడించిన యలమంచిలి మండలం లక్ష్మీపాలెంలో దీన్ని ఏర్పాటు చేయగా శనివారం ప్రారంభించనున్నారు. **- న్యూస్‌టుడే, యలమంచిలి**

## మార్గం.. నీటి కుంటలే ఆసాంతం

అత్తిలి, ఇరగవరం, తణుకు గ్రామీణ మండలాల్లోని రహదారులు ఛిద్రమయ్యాయి. వీరభద్రపురం, వేల్పూరు, గవర్లపాలెం, రేలంగి, అత్తిలి రహదారులు గోతులమయమయ్యాయి. గత ఎన్నికల ముందు రహదారి వేస్తామని హడావుడి చేసిన వైకాపా సర్కారు రహదారిని పొక్లెయిన్లతో తవ్వేశారని ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం రహదారులను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. **-ఈనాడు, అత్తిలి**



వేల్పూరులో కాలువలు పూడిపోవడంతో పోటెత్తిన వర్షపునీరు



వీరభద్రపురం గోతుల్లో ప్రమాదసూచికగా ఏర్పాటు చేసిన చెక్కలు, బకెట్, జెండా



వేల్పూరు నుంచి ఇరగవరం వెళ్లే రోడ్డు దుస్థితి

## వరద బాధితులకు చేయూత



దాతలతో ఎమ్మెల్యే రామాంజనేయులు

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** విజయవాడలో వరద బాధితుల సహాయార్థం పలువురు దాతలు విరాళాలను భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులుకు శుక్రవారం అందజేశారు. భీమవరం మండలం అనాకోడేరు గ్రామస్థులు రూ.3.05 లక్షలు, పెదగరువు గ్రామస్థులు రూ. లక్ష, పట్టణానికి చెందిన భూపతిరాజు వెంకటరామరాజు రూ. లక్ష చొప్పున అందజేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం

**నరసాపురం, న్యూస్‌టుడే:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నామని ప్రాంతీయ ఆసుపత్రుల పర్యవేక్షణాధికారి పి.సూర్యనారాయణ అన్నారు. స్థానిక ప్రాంతీయాసుపత్రిని శుక్రవారం ఆయన సందర్శించారు. వైద్యులతో సమావేశమై పలు సూచనలు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు అన్నిరకాల ఔషధాలు అందించాలన్నారు. ఖాళీగా ఉన్న వైద్య సిబ్బంది పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నామన్నారు. డెంగీ సోకి ప్లేట్‌లెట్స్ అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఎక్కిస్తున్నామని ఆయన తెలిపారు. సమావేశంలో ఆసుపత్రి పర్యవేక్షకురాలు సుప్రియ, వైద్యులు కేవీ రామకృష్ణ, జె.గణేశ్, సుహాష్, హ్యాపీ, శిరీష, లక్ష్మీప్రశాంతి, భారతి, క్రాంతిప్రియ, మారుతి, గరీమ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్తు సమస్యలకు సత్వర పరిష్కారం



వేదిక ఛైర్మన్ సత్యనారాయణకు వినతిపత్రం అందిస్తున్న వినియోగదారులు

**గునుపూడి, న్యూస్‌టుడే:** విద్యుత్తు సమస్యలను సత్వర పరిష్కారం చూపేలా కృషి చేస్తున్నట్లు విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఛైర్మన్ బి.సత్యనారాయణ (విశాఖపట్నం) పేర్కొన్నారు. భీమవరంలోని ఈఈ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది సుమారు 350 ఫిర్యాదులు అందగా 274 పరిష్కారమయ్యాయన్నారు. 107 కేసుల్లో వినియోగదారులకు సంస్థ నుంచి రూ. 14,26,650 పరిహారం ఇప్పించామన్నారు. స్వతంత్ర సభ్యుడు రాయసం సురేంద్రకుమార్, ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు, పలువురు ఏఈలు పాల్గొన్నారు.

### ఎస్ఈగా రఘునాథబాబు బాధ్యతల స్వీకరణ



**గునుపూడి, న్యూస్‌టుడే:** విద్యుత్తు ఎస్ఈగా ఆలపాటి రఘునాథబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. భీమవరం పారిశ్రామికవాడలో ఉన్న కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించగా ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు మొక్క అందించి స్వాగతం పలికారు. ఎస్ఈలు ఎ.తిలక్‌కుమార్ (రాజమహేంద్రవరం), పి.సాల్మన్‌రాజు (ఏలూరు), ఉద్యోగ సంఘాల నాయకులు, గుత్తేదారులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు డీఈఈగా కొత్తపల్లి రాంబాబు బాధ్యతలు స్వీకరించారు.

### 30న కలెక్టరేట్ వద్ద ధర్నా

**భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** కార్మికులు, వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఒప్పంద సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జేఎన్‌వీ గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ విషయంలో ప్రభుత్వాలు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు.

# ఆక్వా ఉత్పత్తుల్లో అగ్రస్థానం



ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, చిత్రంలో కలెక్టర్ నాగరాణి, మస్తాన్‌రావు తదితరులు

**ఉండి, న్యూస్‌టుడే:** ఆక్వా ఉత్పత్తుల్లో దేశంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. ఉండిలోని కోట్ల ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన ఇండియా ఇంటర్నేషన్ ఆక్వా కల్చర్ ఎక్స్‌పోను ఆయన కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఆక్వా ఉత్పత్తులు 10 కోట్ల టన్నులకు చేరువలో ఉన్నాయన్నారు. వీటిలో 60 శాతం ఆంధ్రప్రదేశ్ నుంచే వెళ్తున్నాయని వివరించారు. గుడ్లు, కోడి మాంసం తరహాలో స్థానికంగా చేపల వినియోగాన్ని పెంచేందుకు విస్తృత స్థాయిలో ప్రచారం జరగాలన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గత సీఎం జగన్ కుక్కలు చించిన విస్తరిలా మార్చారని విమర్శించారు. ఆక్వా విద్యుత్తు రాయితీ అంశంపై ముఖ్యమంత్రితో మాట్లాడతానని పేర్కొన్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ ఆక్వా మేతలో మరికొంత రాయితీ ఇచ్చేలా కృషిచేస్తానన్నారు. ఎంపెడా డీడీ టీజీమనోజ్ కుమార్, జిల్లా మత్స్యశాఖాధికారి ఆర్‌వీఎస్‌వీ ప్రసాద్, ఎక్స్‌పో చీఫ్ ఎంఎ నజీర్, ఏపీ మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు నంబూరి వెంకటరామరాజు, సూర్యమిత్ర ఎండీ యర్రింకి సూర్యారావు, ఆక్వా ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.శ్రీనివాసరావు, వివిధ ఆక్వా ప్రయోగశాలల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

### ఆధునిక పద్ధతులతో సత్ఫలితాలు

ఆధునిక పద్ధతులతో మెరుగైన దిగుబడులు సాధించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. ఆక్వా ఎక్స్‌పోలో వివిధ స్టాల్స్‌ను ఆమె పరిశీలించి మాట్లాడారు. అందుబాటులో ఉన్న సేవలపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి ప్రదర్శనలు దోహదపడతాయన్నారు.



బాలికల బృందం

### రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

**ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే:** పల్నాడు జిల్లా వినుకొండ లయోలా పాఠశాలలో ఈ నెల 28 నుంచి జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ బాలబాలికల స్కూల్ గేమ్స్ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 36 మంది ఎంపికయ్యారని అండర్-17 ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి అలివేలు మంగ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### 30న భీమవరంలో ఉద్యోగ మేళా

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో భీమవరం ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 30న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సీహెచ్ మధుభూషణ్ శుక్రవారం తెలిపారు. వివిధ సంస్థలు ఈ మేళాలో పాల్గొని దాదాపు 200 కస్టమర్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, రుణ మంజూరు అధికారి, ఫార్మసీ సహాయక కొలువులకు అర్హతల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తాయని తెలిపారు. 18 నుంచి 30 ఏళ్లలోపు వయసున్న వారు అర్హులు. పూర్తి వివరాలకు 94418 41622 నంబరులో సంప్రదించవచ్చు.

### అంతర్జాతీయ విపణిలో అపార అవకాశాలు

**పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే:** అంతర్జాతీయ విపణిలో అపార ఉపాధి, ఉద్యోగావకాశాలు ఉన్నాయని దిల్లీలోని అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రధాన శిక్షకుడు పొల్లూరి హేమాద్రి అన్నారు. స్థానిక దాసరి నారాయణరావు మహిళా డిగ్రీ కళాశాలలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... నాణ్యతా ప్రమాణాలు పాటిస్తే విదేశాలకు సులభంగా ఎగుమతులు చేయొచ్చన్నారు. ఆర్థిక ప్రణాళిక, సిబ్బంది నియామకం, వస్తువులు, సేవలు, కొనుగోలు తదితరాల్లో మెలకువలు నేర్చుకోవాలన్నారు. అయిదు రోజులపాటు తరగతులు కొనసాగుతాయని ఆయన చెప్పారు. ఇండియన్ బ్యాంక్ లీడ్ జిల్లా మేనేజర్ నాగేంద్రకుమార్, జిల్లా నైపుణ్యాధికారి ఎ.కృష్ణారెడ్డి, ప్రధానాచార్యురాలు శోభారాణి, ఉప ప్రధానాచార్యుడు రవిశంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడి కీచక బుద్ధి

పోక్సో కేసు నమోదు

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో పొరుగు సేవల పద్ధతిన పని చేస్తున్న చిత్ర లేఖన ఉపాధ్యాయుడు జక్కుల మురళీకృష్ణ ఒక విద్యార్థితో అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు పాల్పడ్డాడని బాధితురాలి తల్లి శుక్రవారం ఫిర్యాదు చేశారు. గిరిజన సంక్షేమశాఖ ఇన్‌ఛార్జి డీడీ పీవీఎస్ నాయుడు పాఠశాలలో ప్రాథమిక విచారణ చేశారు. వివరాలు ఇలా.. కళాశాల విద్యను అభ్యసిస్తున్న జీలుగుమిల్లి మండలానికి చెందిన ఆ విద్యార్థిని పట్ల అతను రెండేళ్ల కిందట అసభ్యంగా ప్రవర్తించి వేధింపులకు గురి చేశాడు. అప్పట్లో బాధితురాలి తండ్రి మందలించారు. తండ్రి నెల కిందట మృతి చెందారు. తండ్రి లేకపోవడాన్ని ఆ కీచక ఉపాధ్యాయుడు అలుసుగా తీసుకుని మళ్లీ అసభ్యంగా ప్రవర్తించడం మొదలెట్టాడు. కొడుతూ, బెదిరింపులకు పాల్పడుతున్నాడు. బాధితురాలు తల్లికి చెప్పడంతో జీలుగుమిల్లి జడ్పీటీసీ మాజీ సభ్యుడు, తెదేపా సీనియర్ నాయకుడు బాసిన రాజబాబు సహకారంతో పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయుడిని నిలదీశారు. బాగా చదివే తన కుమార్తె భయపడిపోతోందని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. గతంలో కూడా అతను వేధింపులకు పాల్పడిన సందర్భాలు ఉన్నా ప్రిన్సిపల్, సిబ్బంది పట్టించుకోలేదని, అతనిపై చర్యలు తీసుకోవాలని రాజబాబు ఇన్‌ఛార్జి డీడీని కోరారు. తాను ప్రాథమిక విచారణ చేసి, ఏటీడబ్ల్యూవో శ్రీవిద్యతో తదుపరి విచారణ చేయించానని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి అతనిపై చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి డీడీ తెలిపారు. ఎస్సై దుర్గా మహేశ్వరరావు విచారణ చేస్తున్నారు. నిందితుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

# డ్వామా పీడీ బాధ్యతల స్వీకరణ



అప్పారావుకు అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

**భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** గ్రామీణ నీటి యాజమాన్య సంస్థ జిల్లా పథక సంచాలకుడి(డ్వామా పీడీ)గా కేసీహెచ్ అప్పారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పీడీగా పని చేసిన ఎం.ప్రభాకరరావు తాడేపల్లిగూడెం డీఎల్పీవోగా బదిలీ అయ్యారు. గతంలో గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారిగా పనిచేసిన అప్పారావు డ్వామా పీడీగా నియమితులయ్యారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

# ఆరుగురికి గాంధీ స్మారక పురస్కారాలు

**ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే:** మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఆరుగురు గాంధేవాదులు, సేవాతత్పరులను గాంధీ స్మారక పురస్కారాలకు ఎంపిక చేసినట్లు సర్వోదయ మండలి ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి అక్టోబరు 2న పురస్కారాలు ప్రదానం చేస్తామన్నారు. ఎంపికైన వారు: తుమ్మలపల్లి శివ (భీమవరం), కొండ్రెడ్డి సర్వేశ్వరరావు (ఉంగుటూరు), లకంసాని సత్యనారాయణ (మల్లవరం), పెన్మెత్స రామమోహన వర్మ (చింతపర్రు), కేమిశెట్టి లలితాంబ (వల్లివేరు), రుద్రరాజు బంగారాజు (పత్తేపురం).

# వ్యవసాయ సంక్షోభానికి ప్రభుత్వ విధానాలే కారణం



రైతు సదస్సులో మాట్లాడుతున్న మాజీ మంత్రి శోభనాద్రీశ్వరరావు

**ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** వ్యవసాయ సంక్షోభానికి ప్రభుత్వాల విధానాలే కారణమని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాలు అవసరమని వ్యవసాయ శాఖ మాజీ మంత్రి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. ద్వారకాతిరుమల శ్రీకృష్ణ యాదవ కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర రైతు సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ అధ్యక్షత వహించారు. ముందుగా రైతు సంఘం జెండాను గుత్తికొండ వెంకట కృష్ణారావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ రైతులు తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బడా కార్పొరేట్ కంపెనీలకు మోదీ ప్రభుత్వం గడిచిన ఐదు సంవత్సరాలలో రూ.14 లక్షల కోట్లు బ్యాంకు రుణాలు మాఫీ చేసిందని, రైతులకు మాత్రం ఒక్క పైసా కూడా రుణ మాఫీ చేయలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పూర్వ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయంలో రైతుల సంఖ్య రోజు రోజుకు తగ్గిపోతోందన్నారు. కౌలు రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని విమర్శించారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఉపాధ్యక్షులు వై.కేశవరావు మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై దేశ వ్యాప్తం రైతు ఉద్యమం త్వరలో నిర్వహిస్తామని, నవంబరు 26న దిల్లీలో జరగబోయే కార్యక్రమంలో రైతు సంఘాలతో పాటు కార్మిక సంఘాలు పాల్గొంటాయని వివరించారు.

### రేపు మంత్రి నారాయణ రాక

**పాలకొల్లు, న్యూస్‌టుడే:** రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ఆదివారం పాలకొల్లు రానున్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక సాగునీటి సరఫరా పథకాన్ని పరిశీలిస్తారు. ఆపై హిందూ కైలాస వనం, అబ్దుల్ కలాం పార్కు, రామగుండం ఉద్యానవనం, ఎన్టీఆర్ కళా క్షేత్రం, అన్న క్యాంటీన్‌లను మంత్రి సందర్శిస్తారు. అనంతరం టిడ్కో సముదాయానికి వెళ్లి, అసంపూర్తి పనులను పరిశీలిస్తారు. ఈ మేరకు పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం అధికారులు, నాయకులతో మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్షించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. నారాయణ పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు.

### ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించి మొదటి విడత కౌన్సెలింగ్ శుక్రవారం ముగిసింది. మొదటి సంవత్సరానికి మొత్తం 150 సీట్లు మంజూరు కాగా.. వీటిలో ఆలిండియా కోటా 22, రాష్ట్ర కోటా 55, ఎన్ఆర్ఐ కోటా 14, సెల్ఫ్ ఫైనాన్స్ కోటా 36, ఇతర కోట కింద 36 సీట్లు కేటాయించారు. ఆలిండియా కోటా కింద ఇప్పటి వరకు 19, రాష్ట్ర కోటాలో 53, కన్వీనర్ కోటాలో 14, సెల్ఫ్ ఫైనాన్స్‌లో 36 మంది చేరారు.



### 1న నిరసన దీక్షలకు పిలుపు

**ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే:** విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అక్టోబరు 1న నిరసన దీక్షలు నిర్వహించనున్నట్లు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. స్థానిక ఇఫ్టూ కార్యాలయంలో శుక్రవారం పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, పీఎస్ఎఫ్ఐ నాయకుల సమావేశం నిర్వహించారు. లాభాల బాటలో ఉన్న పరిశ్రమను కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రైవేటుపరం చేయాలని చూస్తోందని విమర్శించారు.

# కాలువలో విద్యార్థిని మృతదేహం

అనుమానాస్పద మృతిగా కేసు



శ్రావణ సంధ్య (పాత చిత్రం)

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే :** మూలలంక వయ్యేరు కాలువలో శుక్రవారం ఉదయం బాలిక మృతదేహాన్ని గుర్తించారు. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు.. తణుకు మండలం కోనాలకు చెందిన తానంకి శ్రావణ సంధ్య (14) ముద్దాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. గురువారం పాఠశాలకు వచ్చిన విద్యార్థిని తరగతి గదిలో పుస్తకాలు సంచి ఉంచి బయటకు వెళ్లిపోయింది. ముద్దాపురం నుంచి దువ్వ వెళ్లే రోడ్డులో మూలలంక వయ్యేరు కాలువలో దూకి గల్లంతైంది. పోలీసులు, ఫైర్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు గురువారం నుంచి గాలింపు చర్యలు చేపట్టాయి. శుక్రవారం కాలువలో విద్యార్థిని మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీఎస్‌వి మూర్తి తెలిపారు.

**బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)**
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

### మానసిక దివ్యాంగ బాలికకు వేధింపులు

యువకుడి అరెస్టు

**కాళ్ల (భీమవరం పట్టణం), న్యూస్‌టుడే:** కాళ్ల మండలానికి చెందిన మానసిక దివ్యాంగ బాలికను వేధింపులకు గురి చేసిన యువకుడిని అరెస్టు చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. వారి కథనం ప్రకారం.. 5వ తరగతి చదువుతున్న బాలికను ఏలూరుకు చెందిన కారు చోదకుడు ఎం.కృపానంద్ ఈ నెల 19న కారులోకి తీసుకెళ్లి వేధింపులకు గురిచేశాడు. ఈ విషయాన్ని ఆ బాలిక వచ్చిరానీ మాటల్లో కుటుంబ సభ్యులకు చెప్పగా వారు పోలీసులను ఆశ్రయించారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశామని ఎస్సై నాళం శ్రీనివాసరావు చెప్పారు.

# భీమవరం

•భీమవరం •ఉండి

## నేడు గోవింద శంఖారావం పాదయాత్ర

**ఉండి, న్యూస్‌టుడే:** శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన ఘటనపై తక్షణం చర్యలు తీసుకోవాలంటూ ఉండిలో శనివారం గోవింద శంఖారావం పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మ పరిరక్షణ సమితి నాయకుడు నల్లా కిరణ్‌ప్రసాద్ తెలిపారు. ఉండిలో రాజులపేట శివాలయం నుంచి పెద్ద వంతెన కూడలిలో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వరకు యాత్ర జరుగుతుందని పేర్కొన్నారు.

## వినతుల స్వీకరణ

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో జనవాణి కార్యక్రమం శుక్రవారం జరిగింది. భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వీటిని పార్టీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

## సహాయ కమిషనర్‌గా వెంకటేశ్వరరావు

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** భీమవరం పురపాలక సహాయ కమిషనర్‌గా చోడగం వెంకటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన జంగారెడ్డిగూడెం, సామర్లకోట, నగరి, చింతలపూడి, ఆకివీడులలో పనిచేశారు. ఇటీవల బదిలీల్లో ఇక్కడకు సహాయ కమిషనర్‌గా వచ్చారు. బాధ్యతలు చేపట్టాక కమిషనర్ కె.రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

### ట్రాన్స్‌కో ఏఈగా అప్పారావు

**వీరవాసరం, న్యూస్‌టుడే:** ట్రాన్స్‌కో వీరవాసరం మండల ఏఈగా ఆర్వీ అప్పారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పాలకోడేరు మండలంలో పనిచేసిన ఆయన బదిలీపై వీరవాసరం వచ్చారు. వీరవాసరంలో ఏఈగా పనిచేసిన రవీంద్రవర్మ ఇటీవల భీమవరం పట్టణానికి బదిలీ అయ్యారు.

## నేత్రపర్వంగా పవిత్రోత్సవాలు



పవిత్రాల అలంకరణలో స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లు

**కాళ్ల, న్యూస్‌టుడే:** కాళ్లకూరు వేంకటేశ్వర స్వామి ఆలయంలో సప్తనదీ జలాభిషేక పూర్వక పవిత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు పవిత్రాలను అలంకరించారు. యాగశాలార్చన, సుదర్శన, నారసింహ, సంక్షేప రామాయణం హోమాలను ప్రధానార్చకుడు కాండూరి వెంకటరమణాచార్యులు, వేదపండితుడు ఫణిశర్మ పర్యవేక్షణలో నిర్వహించినట్లు ఈవో ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు. వేడుకల ముగింపు సందర్భంగా శనివారం ఉదయం 8 గంటలకు మహా పూర్ణాహుతి, సప్తనదీ జలాలతో శోభాయాత్ర అనంతరం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

# శివార్లకు చేరని జలాలు

## అధ్వానంగా పంట కాలువలు

**భీమవరం అర్బన్, న్యూస్‌టుడే**

వైకాపా ప్రభుత్వ హయాంలో అయిదేళ్ల పాటు సాగునీటి కాలువల ప్రక్షాళన ఊసే లేదు. దీంతో అవన్నీ గుర్రపుడెక్క, తూడుతో నిండిపోయి అధ్వానంగా మారాయి. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా కాలువలన్నీ దుస్థితిలో ఉన్నాయి. ఫలితంగా శివారు ప్రాంతాలకు నీరందే పరిస్థితి లేకుండాపోయింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టాక కాలువల పనులకు నిధులు మంజూరు చేసింది. కానీ చాలా చోట్ల పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. ఫలితంగా ప్రధాన కాలువలు సైతం గుర్రపుడెక్కతో నిండిపోయి దర్శనమిస్తున్నాయి.



భీమవరం మండలంలో లోసరి పంట కాలువ నిర్వహణ లేక ఇలా అధ్వానంగా మారింది. దాదాపు 20 కిలోమీటర్లు విస్తరించిన ఈ కాలువ పరిధిలో గొల్లవానితిప్ప, గూట్లపాడు, కొత్తపూసలమర్రు, దొంగపిండి, లోసరి, పాత పూసలమర్రు తదితర గ్రామాల్లో తాగునీటి చెరువులు, 16వేల ఎకరాల్లో వరి చేలు, ఆక్వా చెరువులకు ఈ కాలువ నీరే ఆధారం.



దొంగపిండి వైపు వెళ్లే చోట ఇలా..

### అన్ని చోట్లా ఇదే పరిస్థితి

భీమవరం నియోజకవర్గంలో దాదాపు అన్ని కాలువలు అధ్వానంగానే ఉన్నాయి. భీమవరం-లోసరి, భీమవరం-కాళీపట్నం, భీమవరం-అనాకోడేరు, వెంప కాలువల పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. వీరవాసరం పశ్చిమ కాలువతో పాటు దాని పరిధిలో మత్స్యపురి, బాలేపల్లి, బొబ్బనపల్లి, మెంటేపూడి ఉప కాలువలు అధ్వానంగా ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 4,850 ఎకరాల ఆయకట్టు ఉంది. శివారు ప్రాంతాలకు జలాలు చేరకపోవడంతో సాగు, తాగు నీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోసరి కాలువ ప్రక్షాళన పనులను ఇప్పటికే ప్రారంభించామని.. సాగు, తాగు నీటికి ఇబ్బందులు చర్యలు చేపడతామని జలవనరుల శాఖ ఏఈ ప్రసాదరాజు చెప్పారు.



కాళ్ల మండలం కోపల్లె గ్రామంలో ప్రధాన రహదారికి అనుకుని పశువుల ఆసుపత్రి పక్కన ఉన్న స్థలంలో రైతు సేవా కేంద్రం నిర్మాణాన్ని 2020లో చేపట్టారు. నాలుగేళ్లుగా ఇది పునాది దశ దాటలేదు. దీనికి అనుకుని ఉన్న జాగాలో ఆరోగ్య కేంద్రం నిర్మించాల్సి ఉండగా ప్రస్తుతం అది ఖాళీగా ఉంది. ఆరోగ్య కేంద్రాన్ని పశు వైద్యశాల భవనంలోనే నిర్వహిస్తున్నారు.

## నాలుగేళ్లుగా.. లేదు కదలిక!

**కాళ్ల, న్యూస్‌టుడే:** గత ప్రభుత్వ హయాంలో ముందు చూపు లేకుండా చేపట్టిన పనులు అసంపూర్తిగా నిలిచి పోవడంతో రూ.లక్షల ప్రజాధనం వృథా అయ్యే పరిస్థితి ఏర్పడింది. కాళ్ల మండలం కోపల్లె గ్రామంలో రూ. 43.60 లక్షలతో చేపట్టిన పంచాయతీ భవనం దాదాపు చివరి దశకు చేరింది. తలుపులు, కిటికీలు అమర్చి, విద్యుత్తు సౌకర్యం కల్పిస్తే దీనిని వినియోగించుకోవచ్చు. కానీ నెల తరబడి పనులను నిలిపివేయడంతో ఆ భవనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఈ ప్రాంగణం చిన్నపాటి కొలనులా మారింది. ప్రస్తుతానికి వసుధ ఫౌండేషన్ భవనంలో సచివాలయం, పంచాయతీ కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. ఈ అంశంపై పంచాయతీరాజ్‌శాఖ డీఈ కె.శ్రీనివాసరావు స్పందిస్తూ గుత్తేదారునికి సకాలంలో బిల్లు రాకపోవడంతో పనులు నిలిపేశారని తెలిపారు. ఈ భవనాల పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.



కోపల్లెలో అసంపూర్తిగా పంచాయతీ భవనం

## తరలివెళ్లిన తెదేపా శ్రేణులు

**పాలకోడేరు, న్యూస్‌టుడే:** ఏపీఐఐసీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాక శుక్రవారం జిల్లాకు వచ్చిన మంతెన రామరాజుకు స్వాగతం పలికేందుకు పాలకోడేరు మండలం నుంచి తెదేపా నాయకులు, కార్యకర్తలు ఆకివీడు తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు, నాయకులు కామన రాంబాబు, కమ్మిల రాంబాబు, డి.కృష్ణ, జక్కంశెట్టి అశోక్, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## సహాయ నిధి చెక్కు అందజేత

**ఆకివీడు, న్యూస్‌టుడే:** ఆకివీడు మండలం కాళింగగూడెం గ్రామానికి చెందిన తాండ్ర మీనా గుండె శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈమెకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2,73,719 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు చెక్కును భీమవరం కార్యాలయంలో ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఆమె కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు.

## పొదుపు నిధులకు పూర్తి భద్రత



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ఆనందరాజు

**ఉండి, న్యూస్‌టుడే:** పొదుపు నిధులకు పూర్తిస్థాయిలో భద్రత కల్పిస్తున్నామని, ఖాతాదారులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఉండి సహకార సంఘం ప్రత్యేకాధికారి ఆనందరాజు తెలిపారు. ఆ సంఘం మహాజనసభను శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఆనందరాజు మాట్లాడుతూ ఉండి సహకార సంఘంలో ప్రక్షాళన ప్రక్రియ చురుగ్గా జరుగుతోందని వివరించారు. మేనేజర్ శ్రీనివాస్ సంఘం ప్రగతి, ఆదాయ వ్యయాలను వివరించారు.

## డిజిటల్ లాకర్‌పై అవగాహన

**దుంపగడప (ఆకివీడు), న్యూస్‌టుడే:** డిజిటల్ లాకర్ వినియోగంపై దుంపగడప వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ కె.సుజాత మాట్లాడుతూ అన్ని ధ్రువపత్రాలను డిజిటల్ రూపంలో భద్రపరుచుకొనేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు.

## ఉపాధ్యాయులపై యాప్‌ల భారం



ఉపాధ్యాయులతో సాయివర్మ

**వీరవాసరం, న్యూస్‌టుడే:** వివిధ యాప్‌లలో వివరాల నమోదు ఉపాధ్యాయులకు భారంగా మారిందని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయివర్మ పేర్కొన్నారు. వీరవాసరం మండలంలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఆయన వీరవాసరం, రాయకుదురు తదితర గ్రామాల్లో పర్యటించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. సంఘం మండల అధ్యక్షుడు కరక సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి వై. వెంకటేశ్వర స్వామి, జిల్లా కార్యదర్శి సుబ్బరాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## అది ఎంపెడా భవనమే



నిర్మాణ దశలో కార్యాలయం

**భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** భీమవరం వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్మాణంలో ఉన్న భవనం సముద్ర ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ(ఎంపెడా)కు చెందనదని జిల్లా రెవెన్యూ అధికారి ఉదయభాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌ను ఆ భవనంలోకి మారుస్తారనే ప్రచారం వాస్తవం కాదని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌ను ఎక్కడ నిర్మించేది ఇంకా నిర్ణయించలేదని పేర్కొన్నారు.

## 3 నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు



గోడపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మ ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు అక్టోబరు 3న ప్రారంభం కానున్నాయి. వేడుకల గోడపత్రాలను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు అమ్మవారిని సువర్ణ రజత కవచాలతో అలంకరిస్తారు. 4న బాల త్రిపుర సుందరి, 5న గాయత్రి, 6న అన్నపూర్ణ, 7న మహాలక్ష్మి, 8న లలితా త్రిపుర సుందరి, 9న సరస్వతి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దని, 12న రాజరాజేశ్వరిదేవి రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. 12న గ్రామోత్సవం, 14న అన్న సమారాధన జరుగుతాయని ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ, ఈవో బి.మహాలక్ష్మీ నగేశ్ తెలిపారు.

**భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** మెంటేవారితోటలోని బాలాత్రిపుర సుందరి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాల కరపత్రాలను మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం ఆవిష్కరించారు. ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ వచ్చే నెల 3 నుంచి 12వ తేదీ వరకు కుంకుమ పూజలు, 14న గ్రామోత్సవం, 17న అన్నసమారాధన జరుగుతాయని తెలిపారు.

## శునకాలకు నేడు ఉచిత టీకాలు

**గునుపూడి, న్యూస్‌టుడే:** ర్యాబిస్ నివారణ దినోత్సవం సందర్భంగా శునకాలకు అన్ని పశు వైద్యశాల్లో శనివారం ఉచితంగా టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి కె. మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. భీమవరం పశువుల ఆసుపత్రి ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుంచి టీకాలు వేస్తామన్నారు.

## భీమవరం సినిమాలు

**భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే**

| | |
|---|---|
| శ్రీపద్మాలయ స్క్రీన్ 1 | దేవర |
| శ్రీపద్మాలయ స్క్రీన్ 2 | దేవర |
| నటరాజ్ | దేవర |
| కిషోర్ స్క్రీన్ 1 | దేవర |
| కిషోర్ స్క్రీన్ 2 | దేవర |
| ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 1 | దేవర |
| ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 2 | దేవర |
| ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 3 | దేవర |
| ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 4 | దేవర |
| విజయలక్ష్మి స్క్రీన్ 1 | దేవర |

## మురుగు.. రహదారిపై పరుగు



బస్టాండ్ ఆవరణలో నిలిచిన నీరు

**భీమవరం అర్బన్, న్యూస్‌టుడే:** భీమవరం రెండో పట్టణ పరిధిలో ఆర్టీసీ పాత బస్టాండ్ ఆవరణలో ఇలా మురుగు నిలిచిపోయింది. దీన్ని ఆనుకుని కాలువ ఉన్నా నిర్వహణ లేకపోవడంతో నీరు ముందుకు వెళ్లడం లేదు. చివరికి ఆ మురుగంతా బస్టాండ్ ఆవరణలోకి చేరి ఆ ప్రాంతం అధ్వానంగా మారిపోయింది. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై పురపాలక శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు స్పందిస్తూ క్షేత్ర పరిశీలన చేసి కాలువ ప్రక్షాళన పనులు చేయిస్తామని తెలిపారు.

## శిథిలావస్థలో గ్రంథాలయం



**ఉండి, న్యూస్‌టుడే:** నియోజకవర్గ కేంద్రమైన ఉండిలోని గ్రంథాలయానికి వచ్చే చదువరులకు అవస్థలు తప్పడం లేదు. ఈ ప్రాంగణంలోకి ప్రవేశించాలంటే బురదలో అడుగేయాల్సిందే. వర్షం కురిస్తే ఈ భవనం ఆవరణలో రోజుల తరబడి నీరు నిలిచిపోతోంది. ఈ భవనం శ్లాబు బీటలు తీసి పెచ్చులూడుతోంది. వాననీరు దిగువకు చేరి విలువైన పుస్తకాలు తడిసిపోతున్నాయి. గోడలు బీటలు వారుతున్నాయి. పోటీ పరీక్షలకు హాజరయ్యే యువతకు ఈ గ్రంథాలయమే ప్రధాన ఆధారం. అంతర్జాల సౌకర్యం కోసం సమకూర్చిన కంప్యూటర్ మూలకు చేరింది. చుట్టూ మురుగు నిలిచిపోవడంతో దోమల బెడద పెరిగిందని చదువరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ కొత్త భవనం నిర్మాణం, ప్రాంగణాన్ని మెరక చేసేందుకు రూ.80 లక్షలు అవసరమని అంచనా వేశామని.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని గ్రంథాలయ పాలకుడు జె.కృష్ణమూర్తి తెలిపారు.

## వంతెనపై ప్రమాద ఘంటికలు



**ఉండి, న్యూస్‌టుడే:** ఉండి- చేబ్రోలు రాష్ట్రీయ రహదారిలో పాము లపర్రు వంతెన ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. వాహనాలు ఢీకొట్టడంతో ఈ వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు విరిగిపోయాయి. ఆ ప్రాంతంలో పచ్చగడ్డి దట్టంగా పెరిగిపోయింది. రాత్రి వేళ ఏమాత్రం ఆదమరిచినా వాహనం దిగువన ఉన్న కాలువలోకి దూసుకెళ్తుందని చోదకులు చెబుతున్నారు. ఏళ్ల తరబడి సమస్య ఉన్నా యంత్రాంగం స్పందించడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ అంశంపై ఆర్‌అండ్‌బీ ఏఈ కె.శ్రీహరి రాజు స్పందిస్తూ వంతెనను పరిశీలించి అవసరమైన ప్రతిపాదనలు పంపుతామన్నారు.





## క్రీడా మైదానాలకు కొత్త రూపు

### దాతల చేయూతతో అభివృద్ధి



పాలకోడేరు ఉన్నత పాఠశాల మైదానం

**విస్సాకోడేరు (పాలకోడేరు), న్యూస్‌టుడే:** ఉండి నియోజకవర్గంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో క్రీడా మైదానాలు కొత్త రూపు సంతరించుకున్నాయి. గతంలో పిచ్చిమొక్కలు, గోతులతో అధ్వానంగా దర్శనమిచ్చిన మైదానాలు ఇప్పుడు అభివృద్ధిబాట పట్టాయి. స్థానిక శాసనసభ్యుడు రఘురామకృష్ణరాజు చొరవతో ప్రతి గ్రామంలో మైదానాల అభివృద్ధికి దాతలు ముందుకు వస్తున్నారు. ఫలితంగా క్రీడా సాధనకు అనువుగా క్రీడా కోర్టులు రూపుదిద్దుకుంటున్నాయి.

### మోగల్లు ఉన్నత పాఠశాలలో..



సిద్ధమైన ఖోఖో, హ్యాండ్‌బాల్ కోర్టులు

పాలకోడేరు మండలం మోగల్లు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మైదానం అభివృద్ధికి భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాల యాజమాన్యం ముందుకు వచ్చింది. ఇప్పటికే మైదానాన్ని మెరక చేసి కోర్టుల నిర్మాణం పూర్తి చేశారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, హ్యాండ్‌బాల్, లాంగ్‌జంప్, టెన్నిస్ కోర్టులు, రన్నింగ్ ట్రాక్ నిర్మాణంతో పాటు వ్యాయామ పరికరాలను ఏర్పాటు చేశారు. పాఠశాల విద్యార్థులతో పాటు సెలవు రోజుల్లో స్థానిక క్రీడాకారులు కూడా సాధన చేస్తున్నారు. పాఠశాల ముందు భాగంలో చక్కటి ఉద్యానవనాన్ని తీర్చిదిద్దారు.

### పూర్వ విద్యార్థుల సహకారంతో...

పాలకోడేరు, శృంగవృక్షం, విస్సాకోడేరు, కుముదవల్లి ఉన్నత పాఠశాలల్లో మైదానాల రూపు రేఖలు సమారుతున్నాయి. ఆయా గ్రామాల్లో పూర్వ విద్యార్థులు, స్థానిక దాతలు, పలువురు నాయకులు ముందుకు రావడంతో పలు క్రీడా కోర్టులు అందుబాటులోకి వచ్చాయి. పాలకోడేరులో వాలీబాల్ కోర్టుతో పాటు సుమారు 1000 మీటర్ల రన్నింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. శృంగవృక్షంలో మైదానాన్ని చదును చేయడంతో పాటు కోర్టుల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి.

## యువకుడి మృతదేహం గుర్తింపు

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** భీమవరానికి చెందిన పి. నాగరాజు (32) ఈ నెల 25న యనమదుర్రు కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. అతడి మృతదేహాన్ని శుక్రవారం కాలువలో గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై రెహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రపంచ పర్యాటక దినోత్సవం

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని తణుకు మహిళా కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. పర్యాటక శాఖాధికారి ప్రభాకరరావు మాట్లాడారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను ప్రతి ఒక్కరూ సందర్శించాలని కోరారు.

## నిర్వహణ లేక.. అధ్వానం



**చినఅమిరం (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే:** భీమవరం మండలం చినఅమిరంలో గ్రామ నడిబొడ్డున ఉన్న తురకవాని చెరువు గత అయిదేళ్లలో కనీస నిర్వహణ లేక అధ్వానంగా తయారైంది. చెరువంతా గుర్రపుడెక్క, తూడుతో నిండిపోయింది. చుట్టూ పెరిగిన పొదలు విష సర్పాలకు ఆవాసంగా మారి సమీప నివాసితులకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. సమస్యను ఎన్నిసార్లు పంచాయతీ అధికారులు తెలియజేసినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. గతంలో ఈ చెరువు నీటిని స్థానికులు ఇంటి అవసరాలకు ఉపయోగించేవారు. కొన్నేళ్లుగా దీని నిర్వహణను గాలికొదిలేయడంతో నిరుపయోగంగా మారింది. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి కిశోర్ దృష్టికి తీసుకెళ్లగా చెరువు అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేసి పంపుతామని వెల్లడించారు.

# నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

## మధ్యాహ్న భోజనం పరిశీలన

**పోడూరు, న్యూస్‌టుడే:** గుమ్ములూరు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణను తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ శుక్రవారం పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా.. లేదా అని ఆరా తీశారు. భోజన నిర్వహణలో లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## రేపు గుండె వైద్య శిబిరం

**నరసాపురం, న్యూస్‌టుడే:** స్థానిక పాతబజారు సూర్య పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షురాలు సత్యవతి తెలిపారు. శిబిరానికి వచ్చే రోగులకు ఒక్కొక్కరికి రూ.12,500 విలువ చేసే యెకోకార్డియోగ్రామ్, ఈసీజీ తదితర పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు.

## సమస్యల పరిష్కారంలో విఫలం

**నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** సీతారాంపురం సౌత్ గ్రామ సచివాలయంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచి దొండపాటి వెంకట్ అధ్యక్షత వహించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొండవీటి త్రినాథ్, గ్రామస్థులు సతీశ్, మారంపూడి రాము తదితరులు మాట్లాడారు. గ్రామంలో ప్రధాన సమస్యలు పరిష్కరించడంతో పంచాయతీ పాలకవర్గం విఫలమైందన్నారు. ఎక్కడా చూసినా అపరిశుభ్రత కనిపిస్తోందన్నారు. మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయకపోవడంతో జలాలు కలుషితమవుతున్నాయని వాపోయారు. పాలకులు స్పందించి గ్రామంలో సదుపాయాలు కల్పించాలని వారు కోరారు.

10 AM to 1 PM
మేమున్నాం.. మీకు తోడుగా..
నరసాపురం: 80085 74504
పాలకొల్లు: 80085 74510
ఆచంట: 91212 29087

పెనుగొండ, న్యూస్‌టుడే

**సమస్య:** పెనుగొండ శివారు జలంధర్లో ఏడు వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళ చీకట్లో అంధకారం అలుముకుంటోంది. వృద్ధులు, పిల్లలు చీకట్లో రాకపోకలు సాగించేందుకు భయపడుతున్నారు. అధికారులు స్పందించి దీపాలను బాగు చేయించాలి. - సి.సత్యనారాయణ, పెనుగొండ

**సమాధానం:** సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - టి.రత్నాకరరావు, పంచాయతీ కార్యదర్శి

### స్పందించి.. పరిష్కరించి.. స్పందనకు వందనం

**నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** సీతారాంపురం సౌత్ పంచాయతీ కొత్తపేట గ్రామ సచివాలయ రహదారి వెంబడి పడేసిన చెత్తాచెదారాలను పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. సమస్యపై 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన ఈ నెల 23న ప్రచురించిన వార్తకు ఈవోపీఆర్డీ జి.ఆంజనేయశర్మ, గ్రామ కార్యదర్శి స్పందించారు. రహదారి వెంట పేరుకుపోయిన చెత్తాచెదారాలు తొలగింపజేశారు.

**మార్టేరు:** నెగ్గిపూడి పంచాయతీ వనంపల్లి పంట కాలువ చెంత పడేస్తున్న చెత్తను సిబ్బంది తొలగించారు. 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన ఈ నెల 4న ప్రచురితమైన వార్తకు పంచాయతీ అధికారులు స్పందించారు. సిబ్బందితో చెత్తను తొలగించడంతో పాటు స్థానికంగా వ్యర్థాలు పడేయకుండా చర్యలు తీసుకున్నారు.

# మార్పు తెచ్చేలా.. శుభ్రత పెంచేలా!

☛ ప్రభుత్వ బడుల్లో మెరుగుపడనున్న పారిశుద్ధ్యం ☛ ఎస్‌ఎంసీ సభ్యులకు నిర్వహణ బాధ్యతలు

న్యూస్‌టుడే - జిన్నూరు(పోడూరు), పెనుగొండ గ్రామీణ

గాడితప్పిన ప్రభుత్వ పాఠశాలలను గాడిన పెట్టేలా ఎన్డీయే ప్రభుత్వం అడుగులేస్తోంది. బోధనకే పరిమితం కావాల్సిన ఉపాధ్యాయులపై గత వైకాపా ప్రభుత్వం ఎనలేని పని భారం మోపితే... దాన్ని చక్కదిద్దుతోంది. బడుల బలోపేతంలో పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్‌ఎంసీ)లను భాగస్వాములను చేస్తూ నిర్ణయం తీసుకుంది. తద్వారా ఉపాధ్యాయులు కేవలం బోధనాంశాలకే పరిమితమయ్యేలా చూస్తోంది. సర్కారు నిర్ణయంపై ఉపాధ్యాయ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

### రెండేసి రోజుల చొప్పున...

ఎన్డీయే అధికారంలోకి వచ్చాక.. ఇటీవల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించింది. ఈ కమిటీల్లో ఎన్నికైన సభ్యులు పాఠశాలల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించనున్నారు. బడుల పరిశుభ్రతపై బాధ్యతలు వీరికే అప్పగించింది. కమిటీ సభ్యులు, సచివాలయ సంక్షేమ సహాయకులు మరుగుదొడ్ల చిత్రాలు తీయాలని నిర్ణయించింది. వీటిని ఐఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేసేలా తర్ఫీదునివ్వాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించింది. ఇందుకు ప్రత్యేక సంఖ్య, పాస్‌వర్డ్ కేటాయించింది.

### గతంలో ఉత్సవ విగ్రహాల్లా..

గత ప్రభుత్వం పాఠశాల యాజమాన్య కమిటీలను రద్దు చేసి... తల్లిదండ్రుల పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేసింది. ఇందులోని సభ్యులను కేవలం ఉత్సవ విగ్రహాలను చేసింది. నెలకోసారి నిర్వహించే సమావేశాలకు రావడం... సంతకాలు చేయడం... వెళ్లడానికే పరిమితమయ్యారు. తాజాగా ఎన్డీయే ప్రభుత్వం పాఠశాల యాజమాన్య కమిటీలను పునరుద్ధరించి... సభ్యులకు కీలక బాధ్యతలు అప్పగించింది. పారిశుద్ధ్యం విషయంలో ఎక్కడా రాజీపడకుండా చూడాలని దిశానిర్దేశం చేసింది. 'ప్రభుత్వం ఆదేశానుసారం వారంలో రెండ్రోజులు ఎస్‌ఎంసీ సభ్యులు, మరో రెండ్రోజులు సంక్షేమ సహాయకులు మరుగుదొడ్ల చిత్రాలు తీసి అప్‌లోడ్ చేయాలి. ఎక్కడైనా అపరిశుభ్రత కనిపిస్తే ప్రధానోపాధ్యాయుల దృష్టికి తేవాలి' అని డీవైఈవో సత్యనారాయణ తెలిపారు.



వెలగలేరు శివారు కోమటిచెరువు ప్రాథమిక పాఠశాల

బుధ, శుక్రవారాల్లో ఎస్‌ఎంసీ సభ్యుల్లో ఒకరు; సోమ, గురు వారాల్లో సచివాలయ సంక్షేమ సహాయకులు చిత్రాలు తీసి యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

### వారిపైనే భారం...

వైకాపా ప్రభుత్వం ఉపాధ్యాయులపై పలు యాప్‌ల నిర్వహణ పేరిట భారం మోపింది. వీటిలో వివరాల నమోదుకే వారు ఎక్కువ సమయం వెచ్చించాల్సి వచ్చేది. ఫలితంగా విద్యార్థులకు సరైన బోధన అందేది కాదు. ఈ పనులు చేయని వారికి ఉన్నతాధికారులు తాకీదులిచ్చిన ఘటనలు కోకొల్లలు. ఎన్డీయే ప్రభుత్వం తాజాగా నిర్ణయంతో వారిపై భారం తగ్గనుంది.

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

| మండలం | పాఠశాలలు |
|---|---|
| ఆచంట | 68 |
| యలమంచిలి | 82 |
| పాలకొల్లు | 97 |
| పెనుమంట్ర | 49 |
| పెనుగొండ | 61 |
| పోడూరు | 72 |

## గంగాలమ్మకు ప్రత్యేక పూజలు



**నరసాపురం, న్యూస్‌టుడే:** ఎల్బీ చర్లలో వెలసిన గంగాలమ్మకు శుక్రవారం ప్రత్యేకాభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం పుష్పాలు, ఆభరణాలతో విశేషంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వారికి అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం ఆలయావరణలో నిర్వాహకులు అన్నసమారాధన నిర్వహించారు.

**ఏకాంబరేశ్వరస్వామికి అభిషేకాలు..**

**పెనుగొండ, న్యూస్‌టుడే:** స్థానిక కామాక్షి ఆలయంలో శుక్రవారం ఉదయం ఏకాంబరేశ్వరస్వామికి అర్చకుడు కొండవీటి సూర్యనారాయణమూర్తి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు.

## 'తప్పులు కప్పిపుచ్చుకోలేరు'

**నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** తిరుమల ఆలయ చరిత్రలో స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి మిగిలిపోతారని జనసేన ఉభయ గోదావరి జిల్లాల మాజీ సమన్వయకర్త, సీనియర్ నాయకుడు కల్వకొలను నాగతులసీరావు విమర్శించారు. తన తప్పులు కప్పిపుచ్చుకునేందుకు ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న ఎన్డీయే ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు యావత్ హైందవ సమాజం అండగా నిలవాలని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## నీటి సీసాల వితరణ

**యలమంచిలి, న్యూస్‌టుడే:** స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులకు జనసేన నాయకులు శుక్రవారం నీటి సీసాలు వితరణ చేశారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ... స్టీలు సీసాలు అందజేశారు.

## తప్పని తిప్పలు!



మొగల్తూరు మండలం వారతిప్ప నుంచి భీమవరం మండలం వెంప గ్రామానికి వెళ్లే ర.భ.శాఖ రహదారి మడుగులను తలపిస్తోంది. నరసాపురం, భీమవరం పట్టణాల్లోని పలు ప్రైవేట్ పాఠశాలల బస్సులు ఈ మార్గంలోనే విద్యార్థులను తిప్పుతుంటాయి. నిత్యం వందలాది మంది వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు నిలిచి రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని, నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని ర.భ.శాఖ డీఈ కిరణ్‌కుమార్ తెలిపారు. - న్యూస్‌టుడే, మొగల్తూరు

## ఘొల్లుమనేలా గోతులు



పాలకొల్లు మండలంలోని పలు రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. వరిధనం నుంచి కాజ, కొంతేరు, పెద్దమామిడిపల్లి తదితర గ్రామాలకెళ్లే దారి భారీ గుంతలతో ఛిద్రంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు గోతులు తటాకాలను తలపిస్తున్నాయి. ఈ మార్గంలో రాత్రివేళ ప్రయాణమంటేనే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. - న్యూస్‌టుడే, పాలకొల్లు గ్రామీణ

## వృథాతో వ్యధ



పాలకొల్లు పట్టణం లజపతిరాయ్‌పేట మొదటి వీధి ఎదురు ఓ అపార్టుమెంటుకు వెళ్లే పైపులైను దెబ్బతింది. గత కొన్నాళ్లుగా తాగునీరు వృథాగా మురుగు కాలువలోకి పోతున్నా... పట్టించుకునే నాథులే లేరు. అధికారులు స్పందించి నీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు. పైపులైన్‌ను పరిశీలించి బాగు చేస్తామని పురపాలక నీటి నిర్వహణ ఏఈ సాంబశివరావు తెలిపారు. - న్యూస్‌టుడే, పాలకొల్లు మార్కెట్

## ఆలయాల ఈవోగా శ్రీనివాసరెడ్డి



**మొగల్తూరు, న్యూస్‌టుడే:** మొగల్తూరు బృంద దేవాలయాల ఈవోగా బండి శ్రీనివాసులరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న చాగంటి సురేశ్‌నాయుడు పట్టిసీమ ఆలయ ఈవోగా బదిలీపై వెళ్లారు. బండి ముత్యాలమ్మ దేవస్థానం ఈవోగా విధులు నిర్వర్తిస్తున్న డి.రామకృష్ణమరాజు భీమవరం సోమేశ్వరాలయ ఈవోగా బదిలీ అయ్యారు.

## పెనుగొండ సీఐ బాధ్యతల స్వీకరణ



**పెనుగొండ, న్యూస్‌టుడే:** పెనుగొండ సీఐగా రాయుడు విజయకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ సింగ్‌నగర్ ట్రాఫిక్ స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికొచ్చారు. ఆయన్ను పోలీసు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## రెండో పట్టణ ఎస్సైగా ప్రసాద్

**పాలకొల్లు మార్కెట్:** పాలకొల్లు రెండో పట్టణ ఎస్సైగా డీజే ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో తణుకు ట్రాఫిక్, తాడేపల్లిగూడెం ఎస్సైగా పని చేశారు. తాజాగా భీమవరం రెండో పట్టణంలో విధులు నిర్వర్తిస్తూ... బదిలీపై పాలకొల్లుకు వచ్చారు.

## గ్రామీణానికి సురేంద్రకుమార్

**పాలకొల్లు గ్రామీణ:** గ్రామీణ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా బి.సురేంద్రకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పోడూరు ఎస్సైగా పని చేస్తూ.. ఇక్కడికి బదిలీ అయ్యారు.

## పోడూరుకు సుధాకర్‌రెడ్డి

**పోడూరు:** పోడూరు ఎస్సైగా కె.సుధాకర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన తాడేపల్లిగూడెం పట్టణ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఇక్కడికొచ్చారు.

## ఇద్దరు పోలీసులకు ఉద్యోగోన్నతులు

**పెనుమంట్ర:** స్థానిక పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న రైటర్ రాధాకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణలకు ఉద్యోగోన్నతి లభించింది. వీరిని ఏఎస్సైలుగా నియమిస్తూ శుక్రవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

## ఏకధాటిగా వర్షం

**పెనుమంట్ర, న్యూస్‌టుడే:** మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు ఏకధాటి పడిన వానతో జనజీవనం స్తంభించింది. ఆలమూరు, పొలమూరు ఎస్సీ కాలనీల్లోకి వరదనీరు చేరింది.

## మాముడూరులో తప్పిన ప్రమాదం

**పెనుమంట్ర, న్యూస్‌టుడే:** మాముడూరులో శుక్రవారం పెను ప్రమాదం తప్పింది. స్థానిక చిట్టమట్లగర్వుకు వెళ్లే మార్గంలోని ఓ తాటిచెట్టు కింద భాగంలో బలహీనమై ఒక్కసారిగా నేల కూలింది. విద్యుత్తు తీగలపై చెట్టు కూలడంతో సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మూడు స్తంభాలు దెబ్బతిన్నాయి. ప్రమాద సమయంలో వాహన రాకపోకలు, స్థానికులెవరూ లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## స్వచ్ఛతలో భాగస్వాములు కావాలి

**పెనుగొండ, న్యూస్‌టుడే:** 'స్వచ్ఛతా హీ సేవ'లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పెనుగొండ సర్పంచి నక్కా శ్యామలాసోని అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... గ్రామంలోని కార్యాలయాలు, వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపట్టిన స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా యువత, ప్రజలు, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు తదితరాలపై యుఆర్ఎల్ లింక్ ద్వారా అభిప్రాయాలు తెలియజేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి టి.రత్నాకరరావు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శ్యామలాసోని తదితరులు

★ పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యకర సమాజాన్ని చూడగలమని సర్పంచి కాసాని విజయలక్ష్మి తెలిపారు. వడలి పంచాయతీ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛతా హీ సేవపై కార్యదర్శి పి.అచ్యుత రామకృష్ణ స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించారు. ఉప సర్పంచి వి.నరేశ్, నాయకులు ఉప్పలపాటి చంటి తదితరులు పాల్గొన్నారు.

## సమాజంపై బాధ్యత అవసరం

**నరసాపురం, న్యూస్‌టుడే:** విద్యార్థి దశ నుంచే సమాజంపై బాధ్యతగా మెలగాలని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన శుక్రవారం భగత్‌సింగ్ స్టూడెంట్ ఫెస్ట్-2024ను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరామ్, ఫెస్ట్ కన్వీనరు పి.వాసు, కో-కన్వీనర్ ఎండీ జాన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బలరామ్

## ఉద్యమ శిఖరాలను కోల్పోయాం

**నరసాపురం, న్యూస్‌టుడే:** విభిన్న వర్గాల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేసిన ఉద్యమ శిఖరాలను కోల్పోయామని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఇటీవల మృతి చెందిన రుద్రరాజు సత్యనారాయణరాజు, వలవల శ్రీరామమూర్తి సంస్మరణ సభ శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు, ముచ్చర్ల త్రిమూర్తులు, పొగాకు పూర్ణ, నారాయణరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి ఆరేటి మృత్యుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇంజినీరింగ్ సహాయకుడిపై కేసు

**నరసాపురం, న్యూస్‌టుడే:** అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న ఇంజినీరింగ్ సహాయకుడు, ఆయన కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేశామని పట్టణ ఎస్సై ఎస్ఎన్ ముత్యాలరావు శుక్రవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. .. పోడూరు మండలం జిన్నూరుకు చెందిన సీర లక్ష్మీలావణ్య పట్టణంలోని తొమ్మిదో వార్డు సచివాలయంలో కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఆమెకు గతేడాది ఆగస్టులో పోడూరు సచివాలయంలో ఇంజినీరింగ్ సహాయకుడిగా విధులు నిర్వర్తిస్తున్న పాలూరి వీర వెంకటసతీశ్‌తో వివాహమైంది. భర్తతో పాటు ఆయన సోదరుడు బాలకృష్ణ, తండ్రి భోగేశ్వరరావు, తల్లి లక్ష్మి కొన్నాళ్లుగా అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

**మొగల్తూరు, న్యూస్‌టుడే:** రహదారి ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు... పేరుపాలెంనార్తులో ఓ ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. గ్రామానికి చెందిన టి.రాంబాబు, టి.తాతయ్యలకు గాయాలయ్యాయి. వారిని స్థానికులు 108 వాహనంలో భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

## 3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

**పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** స్థానిక క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు తెలిపారు. అమ్మవారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఉత్సవాలను మంత్రి నిమ్మల రామానాయుడు ప్రారంభిస్తారని, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పాల్గొంటారని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



భోజనం వడ్డిస్తున్న మంత్రి నిమ్మల

భక్తులకు అన్నదానం.. **పాలకొల్లు ఆధ్యాత్మికం:** స్థానిక బస్టాండ్ కూడలిలో స్నేహ ఆటో యూనియన్ ఆధ్వర్యాన కొలువుదీర్చిన వినాయక ప్రతిమను శుక్రవారం నిమజ్జనం చేశారు. అంతకుముందు భారీ అన్నదానం చేపట్టగా- మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు.

### శాస్త్రోక్తంగా అంకురార్పణ

**మొగల్తూరు:** స్థానిక కూరగాయల మార్కెట్లో వర్తక సంఘం ఆధ్వర్యాన దేవీనవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల నిర్వహణకు శుక్రవారం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. గునిశెట్టి నరసింహమూర్తి, వరలక్ష్మి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

తాడేపల్లిగూడెం
•తాడేపల్లిగూడెం •తణుకు

## నిఘా నేత్రాలు ఏర్పాటు చేసుకోవాలి


మాట్లాడుతున్న డీఎస్పీ విశ్వనాథ్

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** దేవాలయాల్లో నిఘా నేత్రాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ విశ్వనాథ్ పేర్కొన్నారు. స్థానిక మాగంటి కల్యాణ మండపంలో దేవాలయాల ధర్మకర్తలు, కమిటీ సభ్యులతో ఆలయాల భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలయ పరిసరాల్లో ఎలాంటి సమస్యలు చోటు చేసుకున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సీఐలు సుబ్రహ్మణ్యం, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతతో ఆరోగ్యం

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచడం ద్వారా దోమలను నియంత్రించవచ్చని సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని జంగం చెరువులో డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. మలేరియా యూనిట్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, వార్డు ఆరోగ్య కార్యదర్శి బేబీ కుమారి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌తో వైద్య సిబ్బంది ప్రదర్శన

## గుంతల మార్గంపై చింతల ప్రయాణం

ఇటీవల కురిసిన వర్షాలకు తాడేపల్లిగూడెం పట్టణంలోని రహదారులు అధ్వానంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే రోడ్లపై గోతుల్లో వర్షపునీరు నిలిచి వాహనదారులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. శుక్రవారం బాదంపూడి గోతుల రోడ్డులో ఆర్టీసీ బస్సు టైరు పంక్చరైంది. ప్రయాణికులు దిగి మరో బస్సు ఎక్కేంత వరకు నిరీక్షించారు. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని, ఒళ్లు హూనం అవుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తూతూమంత్రంగా మరమ్మతులు చేస్తుండటంతో గోతులు యథావిధిగానే ఉంటున్నాయని హైవే నుంచి హైవే వరకూ శాశ్వత ప్రాతిపదికన సిమెంట్ రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు. -ఈనాడు, తాడేపల్లిగూడెం


తాడేపల్లిగూడెం: బాదంపూడి వెళ్లే రోడ్డులో నిలిచిన బస్సు, నిరీక్షిస్తున్న ప్రయాణికులు


గూడ్స్‌షెడ్డు రోడ్డులోని వంతెనపై గోతులు

## తుప్పు వదిలించండి..!

తణుకు పురపాలక సంఘం పరిధిలోని చెత్త సేకరించే డబ్బాలు తుప్పుపట్టాయి. వీటిలో వేసిన వ్యర్థాలు బయటకే వస్తున్నాయి. వీటిని ట్రాక్టర్లలోకి తరలించే క్రమంలోనూ చిందరవందరగా పడుతోంది. తుప్పుపట్టి పాడైన తొట్టెల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు. - ఈనాడు, తణుకు



## హెచ్చరికలు పట్టవా..!

తణుకు పురపాలక సంఘం పరిధిలోని పలు కాలనీల్లో ఖాళీ ప్రదేశాల్లో తుప్పలు పెరిగిపోతున్నాయి. పల్లపు ప్రాంతాల నుంచి మురుగునీరు వీటిలోకి చేరుతోంది. దోమల వ్యాప్తి చెందుతుండటంతోపాటు విషసర్పాలు, పందులు సంచరిస్తున్నాయి. దీంతో ఆయా కాలనీల్లో ప్రజలు రోగాల బారినపడుతున్నారు. దీనిపై మున్సిపల్ యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. కమిషనర్ పేరుతో ఖాళీ ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. మూడు రోజుల్లో స్థలాన్ని శుభ్రం చేయాలని లేని పక్షంలో ఆయా స్థలాలను పురపాలక సంఘం స్వాధీనం చేసుకుంటుందని సూచించారు. బోర్డులు ఏర్పాటు చేసి, పక్షం రోజులైనా ఇంతవరకూ శుభ్రం చేయకపోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. -ఈనాడు, తణుకు


తణుకు బ్యాంకుకాలనీలోని ఖాళీ ప్రదేశాల్లో ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డు



**మేమున్నాం.. మీకు తోడుగా..** 10 AM to 1 PM

| | |
|---|---|
| తాడేపల్లిగూడెం | 79950 67078 |
| పెంటపాడు | 79939 36123 |
| తణుకు గ్రామీణ | 85558 50851 |
| అత్తిలి | 91548 46774 |

**పెంటపాడు, న్యూస్‌టుడే**

**సమస్య:** పెంటపాడు మండలం అలంపురంలోని పలు వీధుల్లో డ్రైనేజీ వ్యర్థాలతో పూడిపోయాయి. దోమల సమస్య అధికంగా ఉంది. - **రామారావు, స్థానికుడు**

**సమాధానం:** దోమల మందు పిచికారీ చేస్తాం. - **తాతపూడి ప్రగతి, సర్పంచి**

**సమస్య:** పెంటపాడు మండలం వల్లూరుపల్లిలో వారం రోజులుగా చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు. దీంతో ఇళ్లలో చెత్త పేరుకుపోతోంది. - **లక్ష్మి, స్థానికురాలు**

**సమాధానం:** చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం. - **రామారావు, పంచాయతీ కార్యదర్శి**

## జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

**పెంటపాడు, న్యూస్‌టుడే :** తాడేపల్లిగూడెం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీల్లో పెంటపాడు ప్రభుత్వ పోస్ట్ బేసిక్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రాజేశ్ శుక్రవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## నీటి కాసుల చికిత్సపై గ్రంథం ఆవిష్కరణ

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** గ్లకోమా సొసైటీ ఆఫ్ ఇండియా అఖిల భారత మహా సభలు పాండిచ్చేరిలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. తాడేపల్లిగూడెంకు చెందిన ప్రముఖ కంటి వైద్యుడు జీఆర్ రెడ్డి రచించిన 'ఇంటర్ప్రేటేషన్ ఆఫ్ విజువల్ ఫీల్డ్స్ ఇన్ ఆప్టికల్ కోహినెన్సీ ట్రోమోగ్రఫీ' గ్రంథాన్ని పాండిచ్చేరి మాజీ గవర్నర్ కిరణ్ బేడీ ఆవిష్కరించారు. నీటి కాసుల వైద్యంలో నేత్ర వైద్యులకు మెరుగైన చికిత్స అందించడానికి ఈ గ్రంథం ఎంతో ఉపయోగపడుతుందని జీఆర్ రెడ్డి పేర్కొన్నారు.

## ప్రపంచ పర్యాటక దినోత్సవం

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే :** స్థానిక మహిళా కళాశాలలో శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సెట్‌వెల్, జిల్లా పర్యాటక శాఖ అధికారి ప్రభాకరరావు హాజరై మాట్లాడారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను ప్రతి ఒక్కరూ సందర్శించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. పర్యాటక మేనేజర్ పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

## కరపత్రాల ఆవిష్కరణ



**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** పట్టణంలోని 13వ వార్డులో కొలువైన కనక దుర్గ అమ్మ వారి నవ రాత్రి ఉత్సవాలకు సంబంధించిన కర పత్రాలను స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించండి


నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

**తాడేపల్లిగూడెం వన్ టౌన్, న్యూస్‌టుడే:** కంసాలిపాలెం - మాధవరం ఎర్రకాలువ బ్రిడ్జి, గ్రామీణ ప్రధాన రహదారులు నిర్మాణ పనులు చేపట్టాలని మాధవరంలో శుక్రవారం గోపాలవెంకట్రావు అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం గ్రామ మహాసభలో నాయకులు డిమాండ్ చేశారు. కన్వీనర్ సత్యనారాయణ, సోమరాజు తదితరుల పాల్గొని మాట్లాడారు. అనంతరం నూతన కార్యదర్శిగా జయమ్మను ఎన్నుకున్నారు.

## తిరుపతిపురంలో గ్రామసభ

**అత్తిలి పట్టణం, న్యూస్‌టుడే :** తిరుపతిపురంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచి మాట్లాడుతూ స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు సమష్టిగా కృషి చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీకి పూర్వవైభవం తీసుకొస్తాం : ఆరిమిల్లి



మాట్లాడుతున్న రాధాకృష్ణ

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** వేల్పూరులో శుక్రవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహజన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడారు. రానున్న రోజుల్లో సహకార సంఘానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు. ఎన్డీయే నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**దీక్షకు సంఘీభావం.. తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే :** జగన్‌మోహన్‌రెడ్డి పవిత్రమైన తిరుపతి లడ్డూను అపవిత్రం చేసి, భక్తుల మనోభావాలను దెబ్బతీశారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ విమర్శించారు. ఇరగవరం మండలం తూర్పువిప్పర్రులో చేపట్టిన సనాతన ధర్మ రక్ష దీక్షకు సంఘీభావం తెలిపారు. జనసేన ఇరగవరం మండల అధ్యక్షులు ఆకేటి కాశీ, సర్పంచి సత్యనారాయణ, మాజీ సర్పంచి నర్సింహారావు, శ్రీనివాస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రైవేటు ఆసుపత్రి తనిఖీ


ల్యాబ్ సిబ్బందితో మాట్లాడుతున్న వైద్యాధికారులు

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** తణుకులోని ప్రైవేటు ఆసుపత్రిని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. ఇటీవల అత్తిలికి చెందిన ఒక యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ నేపథ్యంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి భాను నాయక్, ఆకివీడు ఆసుపత్రి వైద్యులు రాజేశ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఆసుపత్రిలో నిర్వహిస్తున్న ల్యాబ్‌కు అనుమతులు లేవని గుర్తించారు. విచారణ వివరాలు కలెక్టర్, డీఎంఅండ్‌హెచ్‌వోలకు అందిస్తామని తెలిపారు.

**దుకాణాల.. తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** పట్టణంలోని నిట్ రోడ్డులో పలు దుకాణాలను సీఐ సుబ్రహ్మణ్యం శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిషేధిత గుట్కా, ఖైనీ విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## అత్తిలిలో భారీ వర్షం

**అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే:** ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి శుక్రవారం అత్తిలి మండలంలో జనజీవనం స్తంభించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉండటంతో మండలంలోని పలు గ్రామాలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై గోతుల్లో నీరు చేరడంతో లోతు తెలియక ప్రయాణికులు, వాహనచోదకులు అవస్థలు ఎదుర్కొన్నారు. బస్టాండు ఏరియా, మట్టపర్తిగరువు, సుబ్బారాయుడి గుడి వీధి, లక్ష్మీనగర్, గోగులమ్మపేటల్లో రహదారులపై నీరు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


అలంకరణలో బలుసులమ్మ, కొండాలమ్మ

## అమ్మవార్లకు విశేష పూజలు

**తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** తాడేపల్లిగూడెం పురదేవత బలుసులమ్మకు శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ★ ఏపీనిట్ సమీపంలోని కొండాలమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

## ఆహార భద్రత అధికారులమంటూ వసూళ్లు

**నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే:** నిడమర్రులోని పలు హోటళ్ల వద్దకెళ్లి తాము ఆహార భద్రత అధికారులమంటూ బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరిపై నిడమర్రు పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. . పెంటపాడుకు చెందిన మంద్రు అశోక్‌బాబు, తానేటి గీతాప్రసాద్ కారులో నిడమర్రులోని రాజేశ్వరి హోటల్‌కు వచ్చి యజమాని రాజేశ్వరి నుంచి డబ్బులు వసూలు చేశారు. అలాగే హోటళ్ల నిర్వాహకులు వేమా శివకుమార్, తోరం రవికుమార్‌ల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేశారు. రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీర ప్రసాద్ తెలిపారు.



## నూతన కమిషనర్‌గా బాధ్యతల స్వీకరణ

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** తాడేపల్లిగూడెం పురపాలక సంఘం కమిషనర్‌గా ఏసుబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన కాకినాడ కార్పొరేషన్‌లో కార్యదర్శిగా విధులు నిర్వర్తించారు. ఉద్యోగ బదిలీల్లో భాగంగా తాడేపల్లిగూడెం వచ్చారు. ఇక్కడ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా ఉన్న మురళీ కృష్ణ విశాఖ నగరపాలక సంస్థకు బదిలీ అయ్యారు.


ఏసుబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఈఈ మురళీకృష్ణ, సిబ్బంది

## మైదానం అధ్వానం

ఇటీవల కురిసిన వర్షాలకు తణుకు జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోని బాస్కెట్ బాల్ కోర్టు పూర్తిగా నీట మునిగింది. ఆడుకునేందుకు వచ్చిన విద్యార్థులు, క్రీడాకారులు వాననీటిని చూసి వెనుదిరుగుతున్నారు. హైస్కూల్ మైదానం లోతట్టుగా ఉండటంతో చిన్నపాటి వర్షానికే జలమయమవుతోందని అధికారులు పరిశీలించి మైదానాన్ని ఎత్తు చేయాలని వారంతా కోరుతున్నారు. - ఈనాడు, తణుకు



## అన్నసమారాధన

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** గణపతి నవరాత్రులను పురస్కరించుకుని పట్టణంలోని రామారావుపేటలో గణేశ్ యూత్ ఆధ్వర్యంలో అన్నసమారాధన శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పేరిచర్ల ఫౌండేషన్ ఛైర్మన్ మురళీ కృష్ణంరాజు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.


చిత్రాలు గీస్తున్న చిత్రకారులు

## చిత్రం.. స్వచ్ఛ సాధనం

**అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే:** సామాజిక సేవా, స్వచ్ఛత పై ప్రజలకు అవగాహన కలిగేలా పాఠశాలల ప్రహరీలపై చిత్రాలు చిత్రీకరిస్తున్నారు. వీటి ద్వారా ప్రజలు, విద్యార్థులు పరిశుభ్రతపై సులువుగా అవగాహన పొందుతారని విద్యాశాఖాధికారులు రమేష్, ప్రసాద్ చెప్పారు.

## మంచినీటికి వెతలు

**అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే:** అత్తిలి పంచాయతీ శివారు మట్టపర్తిగరువు, సీతానగరం ప్రాంతాలకు పైపులైన్ల ద్వారా తాగునీరు రాక స్థానికులు ఇక్కట్లు పడుతున్నారు. మంచినీరు సరఫరా చేసే సమయంలో కొంతమంది మోటార్లతో నీటిని తోడుకుంటున్నారని వాపోతున్నారు.



## ఉద్యోగినిపై లైంగిక వేధింపులు

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** ఉద్యోగినిపై లైంగిక వేధింపులకు పాల్పడి, కులం పేరుతో దూషించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న ఉద్యోగినిపై అదే కళాశాలలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. ఆమెను కులం పేరుతో దూషించసాగాడు. దీనికి సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించే మరో ఉద్యోగిని వత్తాసు పలికారు. వీరిద్దరూ సంబంధిత ఉద్యోగిని విధులు సరిగా నిర్వహించడం లేదంటూ ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన మహిళా ఉద్యోగినికి ఛార్జ్ మెమో ఇచ్చి వివరణ అడిగారు. ఈ క్రమంలో 26న బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రిన్సిపల్‌తోపాటు మరో ఇద్దరి ఉద్యోగులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

## విధులకు ఆటంకం కలిగించారంటూ ఫిర్యాదు

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే :** విధులకు ఆటంకం కలిగించారంటూ శ్రీ చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగిని విధుల్లో అలసత్వంగా ఉంటుందని ప్రిన్సిపల్ మెమో జారీ చేశారు. ఈ నేపథ్యంలో సంబంధిత ఉద్యోగిని ఈ నెల 18న కొంత మందిని వెంట తీసుకుని కళాశాలకు వచ్చి, ప్రిన్సిపల్, ఇతర ఉద్యోగులపై దుర్భాషలాడారు. వారిపై దాడికి ప్రయత్నించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గృహ నిర్మాణ సంస్థ ఏఈగా సతీశ్

**ఉంగుటూరు, న్యూస్‌టుడే:** ఉంగుటూరు మండల గృహ నిర్మాణ సంస్థ ఏఈగా చింతలపూడి సతీశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఏఈ సురేశ్‌బాబు ఏలూరు బదిలీ అయ్యారు. సురేశ్‌బాబుకు ఇంజినీరింగ్ సహాయకులు, గృహ నిర్మాణ సంస్థ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు.

## ఆఖరి మజిలీకీ ఆపసోపాలే

**రేలంగి, తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** ఆఖరి మజిలీలోనూ అవస్థలు తప్పడం లేదు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో శ్మశాన వాటికలు కోతకు గురి కావడం, ఆక్రమణలు పెరిగిపోవడంతో అంతిమ సంస్కారాలకు ఇబ్బందులు ఎదుర్కోవల్సిన పరిస్థితి నెలకొంది. కోనాల, ముద్దాపురం, దువ్వ, గ్రామాల్లో శ్మశాన వాటికలు వయ్యేరు ఏటి గట్టున ఉన్నాయి. వరద సమయంలో కోతకు గురవుతున్నాయి. శ్మశానానికి వెళ్లడానికి సరైన మార్గాలు లేవు. వర్షం వస్తే అంత్యక్రియలు చేయలేని పరిస్థితి. ★ మండపాక గ్రామంలో మూడు చోట్ల శ్మశాన వాటికలు ఉన్నాయి. పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా మారాయి.


చిట్టడవిని తలపిస్తున్న దువ్వ వయ్యేరు గట్టు ఆనుకుని ఉన్న శ్మశాన వాటిక